క్లుప్తంగా

నిబంధనల మేరకు అభివృద్ధి ప్రణాళికల తయారీ

పెదపూడి: పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు నిబంధనల ప్రకారం తయారు చేయాలని జి.మామిడాడ పంచాయతీ కార్యదర్శి కనక నాగేంద్ర అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయం కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఒక రోజు శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కనక నాగేంద్ర మాట్లాడుతూ, గతేడాది పంచాయతీ ప్రణాళికలు పరిశీలించి, 2025–26కు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పంచాయతీ ఆదాయ వనరులు ఎలా ఉన్నాయి, ఎలా ఖర్చు చేయాలో శాఖల వారీగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రత్యేక శిక్షణ పొందిన రామేశ్వరం కార్యదర్శి భోగరాజు ప్రసన్న ఆంజనేయులు పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి, పీఆర్ ఏఈ శ్రీనివాసు పాల్గొన్నారు.

ఆలయాన్ని దర్శించిన దత్త పీఠాధిపతి

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని ఆంధ్రా షిర్డీసాయి మందిరాన్ని శృంగవృక్షం శ్రీదత్త పీఠాధిపతి సాయిదత్త నాగనంద సరస్వతి మహరాజ్ దర్శించుకున్నారు. బుధవారం ఆయన పాదయాత్రలో భాగంగా బాబా మందిరానికి చేరుకున్నారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి ఆయనను సత్కరించి, జ్ఞాపిక అందించారు.

లక్ష్మీనరసాపురంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్

అనపర్తి: కుతుకులూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం జరిగింది. వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడు తూ, క్షయ వ్యాధి అంతానికి జరుగుతున్న ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థులకు టీబీ లక్షణాలు, మందుల వాడకం, పౌష్టికాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు, టీబీ సూపర్‌వైజర్ బి.మహేష్‌బాబు, ఎంపీహెచ్‌ఎస్‌లు జి.బాబు, కె.శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ పి.నాగమణి, ఏఎన్ఎం ఎస్‌కే సబీరా, ఎంపీహెచ్‌ఏ విజయరాజు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతానగరం: మండలంలోని కాటవరానికి చెందిన పెదపూడి సుబ్రహ్మణ్యం (37) రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్టు హెచ్‌సీ వాసంశెట్టి శ్రీను బుధవారం తెలిపారు. వివాహితుడైన సుబ్రహ్మణ్యం ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై, మంగళవారం పొలాల్లో గడ్డి మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని మధ్యాహ్నం సమయంలో పశువుల కాపరి గమనించి, అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. బంధువులు అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించాడు. భార్య ఈశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

పెదపూడి: ప్రజలు డెంగీ వ్యాధిపై అవగాహన పెంచుకుని, తగిన జాగ్రత్తలు పాటించాలని సంపర పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిరామ్ అన్నారు. సంపర గ్రామంలో డెంగీ వ్యాధి నివారణ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశా వర్కర్లతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటిలో, చుట్టుప్రక్కల వారం రోజులు పైబడి ఉన్న నిల్వనీటిని వెంటనే తొలగించాలన్నారు. ఇంటి పరిసరాల్లో చెత్త, ప్లాస్టిక్ డబ్బాలు, టైర్లు వంటి వాటిని దూరంగా పారవేయాలన్నారు. వైద్యారోగ్య శాఖ సూచించిన జాగ్రత్తలు తప్పనిసరిగా ప్రజలు పాటించాలన్నారు. డెంగీ లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలో ఆస్పత్రికి వెళ్లి, మెరుగైన వైద్యం చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌ఈఓ విజయలక్ష్మి, హెచ్‌ఎస్‌ఎం జోగిరాజు, హెచ్‌వీటీ వీరగనిక తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ మినీ ట్యాంకర్ పట్టివేత



స్వాధీనం చేసుకున్న మినీ ట్యాంకర్

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు వద్ద అనుమతి లేని డీజిల్‌ను తరలిస్తున్న మినీ ట్యాంకర్‌ను కొందరు పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. దానికి ఎలాంటి అనుమతులు లేకపోగా, బెండపూడికి చెందిన సంస్థ పేరున నకిలీ బిల్లు చూపించారు. అందులో 1,500 లీటర్ల డీజిల్, రూ.96 చొప్పున రూ.1.44 లక్షలు అని రాసి ఉంది. బెండపూడి నుంచి డీజిల్ రవాణా ఖర్చు ఎక్కువ కదా అని స్థానిక బంకు యాజమానులు అనుమానించి, మధ్యవర్తుల ద్వారా బెండపూడికి ఫోన్ చేయిస్తే తమకు ఆ డీజిల్ వాహనంతో ఎలాంటి సంబంధం లేదని చెప్పినట్టు తెలిసింది. ఈ విషయమై బిక్కవోలు ఎంఎస్‌వోకు ఫోన్ చేయగా, స్పందించ లేదు. ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్‌ను వివరణ కోరగా, దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని, రెవెన్యూ అధికారుల నుంచి ఫిర్యాదు వచ్చాక విచారణ చేస్తామని తెలిపారు. యానాం నుంచి పెద్దఎత్తున సరకు తెచ్చి విక్రయించడం వల్ల స్థానిక బంకుల వ్యాపారులు దెబ్బతింటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రోజు ఇలా ఎన్నో లారీలు వస్తున్నాయని తెలిపారు. అవినీతి అధికారుల అండదండతో ఇది కొనసాగుతుందని ఆరోపించారు.

ఆయిల్‌ధామ్

- గణనీయంగా తగ్గిన ఆయిల్‌పామ్ ధరలు
- అప్పుల పాలవుతున్న రైతులు
- ప్రస్తుతం టన్ను ధర రూ.17,340
- గతంలో రూ.20,935
- ప్రస్తుతం రూ.3,595 నష్టం
- రూ.22 వేలకు స్థిరంగా ఉంచాలని డిమాండ్

మధురపూడి: వంటకాలను పామాయిల్ నూనె రుచికరంగా తీర్చిదిద్దుతోంది. కొంతకాలం నుంచి ఆయిల్‌పామ్ గెలల ధరలు మాత్రం క్షీణించిపోతున్నాయి. దీంతో ఆయిల్‌పామ్ రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేద, మధ్య తరగతి వర్గాల వారు ఈ నూనెను అధికంగా వినియోగిస్తారు. ఈ నూనె ధర పెరుగుతున్నంతగా, గెలల ధరలు పెరగకపోవడంతో ఆయిల్‌పామ్ రైతులకు గిట్టుబాటు కావడం లేదు. ఆయిల్‌పామ్ గెలల ధర ఈ ఏడాది మే నెల నుంచి తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం టన్ను ధర రూ.17,340 మాత్రమే పలుకుతోంది. గతంలో రూ.20,935 వరకు పలికింది. ధర గణనీయంగా తగ్గడంతో రైతులు అప్పుల బారిన పడాల్సి వస్తోంది. రాజానగరం నియోజకవర్గంలో 5,962.59 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ తోటలున్నాయి. ఎకరానికి 57 చెట్లు ఉంటాయి. వీటి ద్వారా ఏటా 12 నుంచి 13 టన్నుల దిగుబడి జరగాల్సి ఉంది. ప్రాథమిక దశలో నీటి సదుపాయం లేకపోతే దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది.

కొరవడిన ప్రభుత్వ ప్రోత్సాహం

పండ్ల తోటల విస్తరణలో ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడింది. ఆరోగ్యకరమైన పండ్లతోటలున్న రాజానగరం నియోజకవర్గంలో రైతులకు రాయితీలు సక్రమంగా కల్పించడం లేదు. ఆయిల్‌పామ్ తోటలను పెంచడానికి ప్రభుత్వం ఆకర్షణీయమైన రాయితీలను అందించాల్సి ఉంది. ఈ మేరకు రైతులకు భరోసా కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందనే విమర్శలు వస్తున్నాయి. సాగుకు పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో రైతాంగానికి ఆర్థిక భరోసా అవసరం. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న కీలకమైన హామీలో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది.

నిలకడగా ఉంచాలి

ఆయిల్‌పామ్ గెలల ధర నిలకడగా ఉండకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కౌలు రైతులకు ఇది మరింత భారమైంది. తోటల ద్వారా ఆదాయం వస్తుందన్న ఆశతో సాగుకు ఉపక్రమించిన రైతుకు నిరాశే మిగులుతోంది. ప్రతి ఏటా ఏప్రిల్ నుంచి దిగుబడి పెరుగుతోంది. ఆ సమయంలో ధర ఆశాజనకంగా ఉంటుందనుకున్న వారికి నిరాశే ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో ధరను నిలకడగా ఉంచాలని రైతులు కోరుతున్నారు.



మధురపూడిలోని ఆయిల్‌పామ్ తోట



బూరుగుపూడిలో గెలలతో ఆయిల్‌పామ్ తోట



ఆయిల్‌పామ్ గెలలు

ఆయిల్‌పామ్ సంవత్సరంగా..

హెచ్చుతగ్గుల ధరలతో సతమతమవుతున్న ఆయిల్‌పామ్ రైతులు.. నవంబర్ నుంచి అక్టోబర్ నెల వరకూ ఆయిల్‌పామ్ సంవత్సరంగా ప్రభుత్వం గుర్తించాలని కోరుతున్నారు. ప్రతి ఏటా ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకూ ఆయిల్‌పామ్ సీజన్‌గా ఉంటుంది. నవంబర్ నుంచి మార్చి వరకు అన్ సీజన్‌గా చెబుతారు. ఈ కాలంలో దిగుబడి తగ్గడమే కాకుండా, ధర కూడా పడిపోతుంది. పెరుగుదల, తగ్గుదల అంచనాతో నిర్ణీత ధర ఉండేలా చర్య తీసుకోవాల్సి ఉందని రైతులు విశ్లేషిస్తున్నారు. రైతు పక్షపాతిగా నిలుస్తానన్న కూటమి సర్కారు రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిలో భాగంగానే అన్ సీజన్‌లో ధర పెంచి, సీజన్‌లో తగ్గిస్తోందని అంటున్నారు. ఇది రైతులకు కాకుండా కంపెనీలకు మేలు చేస్తోందని చెబుతున్నారు.

యాజమాన్య పద్ధతితో మంచి దిగుబడి



పామాయిల్ సాగులో యాజమాన్య పద్ధతులను అవలంబిస్తే గెలల దిగుబడి పెరుగుతోంది. దానిలో భాగంగా చెట్టు చుట్టూ పళ్లాలు ఏర్పాటు చేసుకోవాలి. తగినంత నీరందేలా జాగ్రత్తలు తీసుకోవాలి. కాంప్లెక్స్ ఎరువుల వినియోగంలో నిర్దేశించినట్టుగా వ్యవహరించాలి, దీనివల్ల బలమైన గెలలను పొందవచ్చు. ఇది చాలా ముఖ్యమైనది. సేంద్రియ ఎరువులు, ట్రైకో డెర్మా, పశువుల గెత్తంలో కలిపివేస్తే, గానోడెర్మా వంటి తెగుళ్లు సమసిపోతాయి.

– రినీ, ఉద్యాన శాఖాధికారి, కోరుకొండ

ధర స్థిరీకరణ ముఖ్యం



రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్, ఇతర పండ్ల తోటల దిగుబడుల ధరలను స్థిరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. తద్వారా రైతులకు లాభదాయకంగా ఉంటుంది. తోటల్లోని పండ్ల ధరలనూ స్థిరంగా ఉంచాలి. కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతిగా కాకుండా, కంపెనీల పక్షపాతిగా వ్యవహరిస్తోంది. దీనివల్ల పంటల ధరలు ప్రతి నెలా తగ్గిపోతున్నాయి. ఉద్యానవనాల విస్తృతికి తగిన చర్యలు చేపట్టడం లేదు. పామాయిల్ ధరలు తగ్గడంతో రైతులు అప్పుల బారిన పడుతున్నారు.

– కంటే వినయ్‌తేజ, రైతు సంఘం ప్రతినిధి

బిందు సేద్యంతో నీటి వృథా తగ్గుదల



ఆయిల్‌పామ్ సాగులో బిందు సేద్యాన్ని అనుసరించాలి. తద్వారా నీరు వృథా కాకుండా సద్వినియోగమవుతోంది. అలాగే దిగుబడిని పెంచుకోవచ్చు. చెట్టుకు నీరు నేరుగా సరఫరా కావడంతో గెలల సంఖ్య పెరుగుతుంది. ఆయిల్‌పామ్‌తో పాటు, పండ్ల తోటల రైతులకు భవిష్యత్తులో మంచి లాభాలొస్తాయి. ఆయిల్‌పామ్ ధరలను తగ్గించకూడదు.

– కె.సుబ్రహ్మణ్యం, ఆయిల్‌పామ్ రైతు

నేడు విద్యుత్ అంతరాయం

సీతానగరం: మండలంలోని పలు గ్రామాలకు గురువారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఈఈ ఎస్ శామ్యూల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ ముగ్గళ్ల సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్లకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారన్నారు. వెదుళ్లపల్లి, రాజంపేట, మునికూడలి గ్రామాలకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

రేపు పలు గ్రామాల్లో..

మిర్తిపాడు సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కోసం ములకల్లంక, బొబ్బిల్లంక, మిర్తిపాడు, ఉండేశ్వరపురం గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని ఈఈ శామ్యూల్ తెలిపారు.

ట్రీ కటింగ్, మరమ్మతులకు..

అనపర్తి: మండల కేంద్రమైన అనపర్తిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పీబీజే నటరాజన్ బుధవారం తెలిపారు. దుప్పలపూడి సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11 కేవీ మహేంద్రవాడ ఫీడర్, అనపోతవరం నుంచి ధరణికోట ఫీడర్ పరిధిలో ఉదయం 8 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారన్నారు. మార్కెట్, శేషగిరిరావుపేట, వెంకటరత్నపురం, మెయిన్‌రోడ్డు, కెనాల్ రోడ్డు, ద్వారపూడి రోడ్డు, కాకినాడ రోడ్డు, కొప్పవరం, కేఎల్ఎస్ పురం గ్రామాలు, ఇండస్ట్రియల్ లైన్లు, వ్యవసాయ లైన్లు, ధరణికోట, పాతఊరు తదితర ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుందని చెప్పారు.

రాజానగరం: వార్షిక మరమ్మతుల కోసం స్థానిక సబ్‌స్టేషను పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారని ఏపీఈపీడీసీఎల్ ఇన్‌చార్జి ఈఈ జేపీబీ నటరాజన్ బుధవారం తెలిపారు. రాజానగరం, సూర్యారావుపేట, గైట్ కాలేజ్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ, రాజమహేంద్రవరం పేపరు మిల్లు, బ్రిడ్జి కౌంటీ, తూర్పుగానుగూడెం, ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజినీరింగ్ కాలేజ్, పల్లకడియం, రామస్వామిపేట, ఐశ్వర్య రైస్ మిల్లు, లెనోరా డెంటల్ కాలేజ్, క్వారీ తదితర ప్రాంతాల్లో అన్ని రకాల సర్వీసులకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. మల్లపూడి సబ్‌స్టేషను పరిధిలోని మల్లంపూడి, ముక్కినాడ, తోకాడల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రజలను నట్టేట ముంచిన చంద్రబాబు



క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, పార్టీ శ్రేణులు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: నమ్మి ఓట్లేసిన ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబుకు 40 ఏళ్ల ఘన చరిత్ర ఉందని వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దుయ్యబట్టారు. బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన పార్టీ అనపర్తి మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, సూపర్ సిక్స్ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఆ వైఫల్యాలను ఎండగట్టి, పథకాలు అమలు చేసేలా కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం ద్వారా రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో పేరిట ప్రజల్లోకి వెళ్లనున్నట్టు తెలిపారు. చంద్రబాబు మోసాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తామన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నవరత్న పథకాలతో పాటు, సంక్షేమ, అభివృద్ధి పథకాలు చిత్తశుద్ధితో అమలు చేసిన తీరును కూడా సోదాహరణంగా వివరించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం వల్ల జరిగిన నష్టంపై ప్రజలను చైతన్యపరచాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కూటమి పార్టీల హామీలు, వాటి అమలులో వైఫల్యం తదితర అంశాలను పొందుపరచిన క్యూఆర్ కోడ్‌పై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ మోసం వల్ల రాష్ట్రంలోని ఒక్కొక్క కుటుంబం సగటున రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు నష్టపోయారని ప్రజలకు తెలిపేందుకు నాయకులు, కార్యకర్తలు నడుంబిగించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ అనపర్తి మండల నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, మహిళా విభాగం సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



పెదపూడి మార్కెట్ సెంటర్‌లో సమ్మెలో పాల్గొన్న కార్మికులు, నాయకులు



అనపర్తి దేవీచౌక్ సెంటర్‌లో ఆందోళనకారుల మానవహారం

పెదపూడి: ఏ కార్మికుడికైనా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సత్తిరాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన పెదపూడిలో సార్వత్రిక సమ్మె సందర్భంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి మార్కెట్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. పంటలకు గిట్టుబాట ధర కల్పించాలని, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సమ్మంగి శ్రీరాములు మాట్లాడుతూ, విద్య కార్పొరేటీకరణ విధానాలను వ్యతిరేకించాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పీవీ సీతాపతిరావుకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ ప్రతినిధి పెద్దిరాజు, సీఐటీయూ మండల అధ్యక్షురాలు ఎం.రాజేశ్వరి, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మిడ్డే మీల్స్ వర్కర్లు, బిల్డింగ్ కార్మికులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ధర్నా

సీతానగరం: సార్వత్రిక సమ్మెలో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. అక్కడి నుంచి ర్యాలీగా సీతానగరం బస్టాండ్ సెంటర్‌కు చేరుకుని, మానవహారంగా ఏర్పడ్డారు. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు ఎం.కుమారి మాట్లాడుతూ, లేబర్ కోడ్‌లు రద్దు చేసి, కార్మిక చట్టాలను పునరుద్ధరించాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్చాలని, ఒప్పంద జీఓలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ, విక్రయాలను ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎ జ్యోతి, స్వరాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఇలాఉండగా సీతానగరం మండలంలో పాక్షికంగా బంద్ జరిగింది. సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, బ్యాంక్‌లు, ప్రభుత్వ కార్యాలయాలను మూయించారు. ఆర్టీసీ బస్సులు, ఆటోలు యధావిధిగా ప్రయాణించాయి.

కదం తొక్కిన ఐఎల్‌టీడీ కార్మికులు

అనపర్తి: సార్వత్రిక సమ్మెలో అనపర్తి ఏపీ ఫెడరేషన్ ఆఫ్ ఐఎల్‌టీడీ వర్కర్స్ యూనియన్ కార్మికులు కదం తొక్కారు. సీఐటీయూ అనుబంధమైన ఈ యూనియన్ సభ్యులు బుధవారం పుర వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు కొట్టు సూర్యనారాయణ మాట్లాడుతూ, కార్మికులు, కర్షకులకు ఉరి తాళ్లుగా భావించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనంతరం దేవీచౌక్‌లో మానవహారంగా ఏర్పడి, నినాదాలు చేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు రవ్వ సామ్యూల్‌రాజు, పి.నాగేశ్వరరావు, ఎన్.కోటయ్య, గోలి వెంకటకృష్ణ, రామకృష్ణ, కన్నా సాహెబ్, ఐఎన్‌టీయూసీ నాయకులు, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పీఏఐపై అధికారుల శిక్షణ

సీతానగరం: పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ (పీఏఐ) అనేది పంచాయతీల పురోగతిని అంచనా వేయడానికి ఉపయోగించే సాధనమని ఎంపీడీఓ ఎం.భారతి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పురోగతి సూచిక శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ, పేదరిక నిర్మూలన, జీవనోపాధి, ఆరోగ్యం, పిల్లల అనుకూల వాతావరణం, నీరు, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ, పీఏఐ నిరంతరం అభివృద్ధి స్ఫూర్తిని పెంపొందిస్తుందన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ కేవీఎస్ఎస్ మూర్తి, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పీహెచ్‌సీ డాక్టర్ సునీల్, ఏపీఈపీడీసీఎల్ ఏఈ చంద్రమోహన్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పంచాయతీ పురోగతిపై శిక్షణ



శిక్షణ శిబిరంలో పాల్గొన్న అధికారులు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పురోగతిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలకు ఈ శిక్షణ నిర్వహించారు. ట్రైనర్లు సూరిశెట్టి సురేష్, జి.అశోక్ వారికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళిక 2025–26లో భాగంగా పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ ఎలా తయారు చేయాలో వివరించారు. డిప్యూటీ ఎంపీడీఓ జాన్‌మిల్లన్, ఉప మండల అభివృద్ధి అధికారి వీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకుడు గురువు

నేడు గురుపౌర్ణమి వేడుకలు



కొంకుదురులో చదువు అభ్యసిస్తున్న విద్యార్థులు

బిక్కవోలు: ప్రతి శిష్యుడు గురువును దైవంగా పూజించాలి. విద్యాబుద్ధులు ప్రసాదించి, మనిషికి మంచి జీవితాన్నిచ్చిన గురువులకు వందనం చేయాలని గుర్తుచేస్తుంది గురుపూర్ణమి. అజ్ఞానమనే చీకట్లను తొలగించి, జ్ఞాన వెలుగును ప్రసాదించే గురువులకు ప్రతీక. వేదాలను పునరుద్ధరించి ప్రజలకు అందించిన మహోన్నతుడు వేదవ్యాసుని జయంతి రోజున గురుపౌర్ణమి నిర్వహిస్తుంటారు. జ్ఞాన జ్యోతిని వెలిగించే గురువుపై శిష్యులు చూపే వినమ్రత, వారి ఉన్నతికి మూలమవుతుందని చెబుతారు. నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో సుమారు వెయ్యి మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. గురువారం గురుపౌర్ణమి సందర్భంగా పలువురు ఉపాధ్యాయుల అభిప్రాయాలిలా.

స్ఫూర్తిదాయకుడు



జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకుల్లో గతి తప్పక ప్రవర్తించమని స్ఫూర్తిదాయకంగా బోధించే వ్యక్తి అసలుసిసలైన గురువు. సమాజంలో ఎన్నో జీవితాలను ప్రభావితం చేస్తారు. గురువు చూపిన మార్గంలో పయనించి, ఆయన చెప్పిన నీతి వాక్యాలను ఆచరిస్తే జీవితం ధన్యమవుతుంది.

– గొలుగూరి వెంకటరామారెడ్డి, ఉపాధ్యాయుడు, మెల్లూరు

భక్తిభావం తగ్గుతోంది



రానురాను గురువుపై శిష్యులకు భక్తిభావం తగ్గుతోంది. ప్రస్తుత ఆధునిక పోకడలతో గురుశిష్యుల మధ్య ఘర్షణలు, న్యూనతాభావాలు చోటుచేసుకోవడం విచారకరం. ప్రతి విద్యార్థి తమ గురువును గౌరవించడం ముఖ్యం. తరాలు మారినా, యుగాలు మారినా గురువు ప్రాధాన్యం అలాగే ఉంది.

– సత్తి సుబ్బారెడ్డి, ఉపాధ్యాయుడు, పందలపాక

గురు రుణం తీర్చుకోవాలి



ప్రతి మనిషి మాతృరుణం, పితృరుణం, గురురుణం, దేవతల రుణం తీర్చుకోవాలి. ఆదిగురువులుగా నిలిచిన ప్రతి ఒక్కరూ కూడా తమ గురువుల రుణం తీర్చుకోవాలి. అందరు ఈ విషయాన్ని గమనించాలి. తద్వారా రుణం తీర్చుకోగలుగుతాం.

– జంగా శ్రీనివాసప్రసాద్, ఉపాధ్యాయుడు, బిక్కవోలు

గురువును గౌరవించాలి



తమ సమున్నతికి నిస్వార్థంగా తోడ్పడిన గురువుపై శిష్యునికి కృతజ్ఞతాపూర్వక గౌరవం ఉండాలి. చిన్నప్పటి నుంచి గురువుపై భక్తిభావం పెంచుకోవాలి. సద్గురువు చూపిన బాటలో పయనిస్తే జీవితంలో ఉన్నత స్థానానికి సులభంగా చేరుకునే వీలవుతుంది.

– వైబీఎస్ ఆచార్యులు, కాపవరం

ఆంధ్రాషిర్డీలో ఏర్పాట్లు



బలభద్రపురంలోని ఆంధ్రా షిర్డీ సాయిబాబా

బిక్కవోలు: మండలంలోని ఆంధ్రాషిర్డీగా పేరొందిన బలభద్రపురంలోని షిర్డీసాయి మందిరంలో గురు పూర్ణిమ పూజలకు ఏర్పాట్లు చేశారు. గురువారం ఆలయం వద్ద బాబావారికి క్షీరాభిషేకం, హారతులు, భజనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఉంటుందన్నారు. అలాగే పందలపాక, బిక్కవోలు, కొంకుదురు గ్రామాల్లో బాబా మందిరాల వద్ద ప్రత్యేక పూజలు జరుగుతాయి.

సమష్టి కృషితో సారా, గంజాయి నివారణ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నిరంజన్

పెదపూడి: సారా, గంజాయి రహిత మండలంగా తయారు చేయడానికి అందరూ కృషి చేయాలని కాకినాడ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ టి.నిరంజన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సారా, డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ అనే కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ, చిన్న పిల్లలు స్కూల్ నుంచి వచ్చాక ఎక్కడకు వెళ్తున్నారు, ఎక్కడ నుంచి వస్తున్నారో తల్లిదండ్రులు గమనించాలన్నారు. పిల్లల ప్రవర్తనలో తేడా ఉంటే కచ్చితంగా అదేమిటో తెలుసుకోవాలన్నారు. వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని, అవసరమైతే వైద్యుల వద్దకు తీసుకెళ్లాలన్నారు. ఈ చెడు అలవాట్ల నుంచి పూర్తిగా మాన్పించడానికి తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సచివాలయ ఉద్యోగులు, సిబ్బందికి ఎక్కడైనా గంజాయి, సారా సమాచారం తెలిస్తే, ఎక్సైజ్ శాఖ నంబర్ 14405కు, ఈగల్ టీమ్ నంబర్ 1972కు తెలియజేయాలన్నారు. ఎస్సై మహమ్మద్ ఆలీ, డిప్యూటీ ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.